క్లుప్తంగా

పరామర్శ



రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి (జలదంకి): కావలిలోని పాతూరుకి చెందిన చీమకుర్తి మధురెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి మేనమామ కాపా కృష్ణారెడ్డి గురువారం మృతి చెందారు. కృష్ణారెడ్డి పార్థీవదేహాన్ని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే కావలి రూరల్ మండలం సర్వాయపాళేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మోర్ల రాములు ఇటీవల మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను రామిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రేషన్‌ను సకాలంలో పంపిణీ చేయాలి



వరికుంటపాడు: డీలర్లు రేషన్ లబ్ధిదారులకు సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల చెంచయ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30వ తేదీలోగా 65 ఏళ్లలోపు వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందజేయాలని సూచించారు. సరుకులకు డీడీలు సకాలంలో తీయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. 5వ వార్డుకు చెందిన షేక్ చిన్నకాలేషా, 18వ వార్డుకు చెందిన రాగి సుబ్బమ్మ, 23వ వార్డుకు మాముడూరు హజరత్తయ్య ఇటీవల మృతి చెందగా వారికి కుటుంబాలకు రూ.10వేలు చొప్పున నగదు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కే సుధాకర్ రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ గంధళ్ల వేణు, కోటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఖాన్‌సావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా దర్గాలో జరుగుతున్న గంధమహోత్సవంలో భాగంగా మూడోరోజు గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జప్నే చిరాగి పాతేహాను భక్తిశ్రద్ధలతో జరిపారు. రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఖవ్వాలి, పాటకచేరి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆశావర్కర్ల సంఘ మండల కమిటీ ఎన్నిక



దగదర్తి: స్థానిక జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షురాలిగా నూరి ఆరోగ్యమ్మ, ప్రధాన కార్యదర్శిగా వై అనురాధ, కమిటీ సభ్యులుగా కామేశ్వరమ్మ, పెంచలమ్మ, సునీత, శారద, అరుణమ్మ, శ్రీదేవిని ఎన్నుకున్నారు.

వెంగమాంబ హుండీ కానుకల లెక్కింపు నేడు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ ఆలయ హుండీల్లోని కానుకలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ గురువారం తెలిపారు. ఇటీవల జరిగిన నెలపొంగళ్ల సందర్భంగా భక్తులు సమర్పించిన నగదు కానుకలను లెక్కించి బ్యాంకులో జమచేయనున్నట్లు వివరించారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పార్థసారథి శుక్రవారం పర్యటించనున్నారు. స్థానిక యాదవ బజార్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి పాల్గొననున్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

- ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఉదయగిరిలో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం/ఉదయగిరి: చంద్రబాబు మోసపూరిత హామీలను ఇంటింటికి తీసుకెళ్లి ఎడగట్టాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉదయగిరి, సీతారామపురంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి వంద శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలను సృష్టించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు చెల్లిస్తామని హామీఇచ్చి మోసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని చెప్పి తీరా ఇప్పుడు ఆడబిడ్డ నిధిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెంనాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు అంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న హడావిడి అంతా బూటకమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలు, దుర్మార్గాలను ప్రజలు ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ భయపెట్టాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబు దుర్మార్గ పాలనను చూసి ప్రజలు అసహ్యించుకునే స్థితికి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను అడ్డుకుని ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమ కుటుంబం ఉదయగిరి మెట్టప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేసిందన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు చిత్తశుద్ధితో పాటు పడుతున్నారో.. ఎవరు మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఉదయగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు జీ శ్రీనివాసులు రెడ్డి, మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి, దస్తగిరిఅహ్మద్, ముర్తుజాహుస్సేన్, లక్కినేని అశోక్, షేక్ అలీఅహ్మద్, ఇర్శియా, గడియాల్చి యస్దాని, కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, అక్కుల్ రెడ్డి, ఎం తిరుపతినాయుడు, రవీంద్రరెడ్డి, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, డేగా వంశీ, సీతారామపురం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు, పార్టీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గయ్య, పానెం రమణయ్య, గుర్రం వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేకపాటి

వైభవంగా బాలచౌడేశ్వరి జయంతి వేడుకలు



సంగంలో కడవ బాణం ఊరేగింపు



రంగులతో తీర్చిదిద్దిన అమ్మవారి ఆకృతి

సంగం : స్థానిక కొత్తూరు, రాళ్లచెలిక ప్రాంతాల్లోని బాలచౌడేశ్వరి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారి జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. కొత్తూరులోని ఆలయ ప్రాంగణంలో రంగులతో అమ్మవారి ఆకృతిని తీర్చిదిద్ది విశేష పూజలు జరిపారు. తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో కడవ బాణాన్ని ఊరేగించారు. ఉభయకర్తలుగా సుకమంచి సుగుణమ్మ జ్ఞాపకార్థంగా భర్త సుకమంచి దశయ్య, కుమారుడు భాస్కర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.రాళ్లచెలికలో చందనాలంకారం నిర్వహించారు.

వింజమూరు(ఉదయగిరి):వింజమూరులోని బీసీకాలనీలోని బాలచౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



వింజమూరులో..

లేగదూడల అందాల పోటీలు



సోమశిల: చేజర్ల మండలం తూర్పుకంభంపాడులో జిల్లా పశు సంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో లేగ దూడల అందాల పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ నెల్లూరు డివిజన్ ఉపసంచాలకులు నాగమణి పాడిరైతులకు పశుపోషణలోని మెలకువలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం లేగదూడలకు కాల్షియం, నట్టల నివారణ మందులు అందజేశారు. అనంతరం లేగదూడల అందాల పోటీల్లో పాల్గొన్న 31 మంది రైతులకు బహుమతులు అందజేశారు. ఏడీలు గురుజయంతి, కృష్ణమోహన్, కృష్ణప్రసాద్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



కలిగిరి: అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి

కలిగిరి: రైతులు ఉద్యానశాఖ అధికారుల సూచనలతో ఆధునిక యాజమాన్య పద్ధతుల్లో ఆయిల్‌పామ్‌ను సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. కావలిముస్తాపురం పంచాయతీ కొత్తపేటలో ఆయిల్‌పామ్ సాగుపై రైతుసేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం కింద వంట నూనె పంటల సాగుకు ప్రోత్సాహాలను అందజేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1400 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించిందని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా పత్తి, వేరుశనగ, కూరగాయలు, పూల మొక్కలు, అపరాల పంటలు సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. ఏడీహెచ్ అనురాధ, ఏడీఏ శేషగిరిరావు, ఉద్యాన శాఖ అధికారులు షహీల్, రాజశేఖర్, కార్తీక్ భరద్వాజ్, సుధామయి, జయశ్రీ, త్రీఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఏటీఎం సూర్యానారాయణ,తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ అవసరం



హెన్రీడ్యూనాంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ వంశీకృష్ణ

కావలి (జలదంకి): ప్రథమ చికిత్స ద్వారా ప్రమాదాల్లో గాయపడిన, అనారోగ్యంతో ఉన్న వారికి అత్యవసర వైద్యం అందించడం ద్వారా ప్రాణాలను నిలపవచ్చని, అలాంటి ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ అవసరమని కావలి ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ అన్నారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్లో కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ సంస్థలను ఏర్పాటు చేయాలని హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. విద్యార్థులు రెడ్‌క్రాస్ ద్వారా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, ప్రథమ చికిత్స అందించడం, రక్తదానాన్ని ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు.అనంతరం రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్‌చైర్మన్ హరినారపరెడ్డి, ట్రెజరర్ మధుసూదన్‌రావు, సభ్యులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీవాణి, మనోహర్, ఎంఈఓ గోవిందయ్య, జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ విచారణ



బహిరంగ విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

జలదంకి: రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఉన్నం సరస్వతి కలిసి రూ.12లక్షల మేర నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై కావలి డీఎల్‌పీఓ వెంకటరమణ గురువారం బహిరంగ విచారణ చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా, పంచాయతీ తీర్మానాలు లేకుండా పంచాయతీ నిధులు రూ.12 లక్షలను సర్పంచ్ భర్త ఖాతాలోకి మళ్లించి దుర్వినియోగం చేశారని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల మధ్యన డీఎల్‌పీఓ బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సహకార చట్టం ద్వారా తీసుకున్న పలు ఖర్చులపై వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. అభివృద్ధి పనులు చేపట్టకుండానే, పనులు చేసినట్లుగా రికార్డుల్లో ఎందుకు నమోదు చేశారని, రుజువులు చూపాలని డిమాండ్ చేశారు. పనులు చేపట్టకుండా పంచాయతీ నిధులను సర్పంచ్ భర్త రవి ఖాతాలోకి ఎందుకు మళ్లించారని సమాధానం చెప్పాలని నిలదీశారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా నమోదు చేయడం, పారిశుధ్య పనులు చేపట్టకుండా చేసినట్లుగా చూపడం, అభివృద్ధి పనులు చేపట్టకుండా చేసినట్లు చూపడం ద్వారా నిధులు దుర్వినియోగం చేశారని డీఎల్‌పీఓకు ఆధారాలతో సహా అందజేశారు. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు చేసిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

మర్రిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

డీసీపల్లిలో 411 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 411 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 660 బేళ్లు రాగా, 411 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.195.11 ధర లభించిందని వివరించారు.

కిలో పొగాకు సగటు ధర రూ.194

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు సగటు ధర రూ.194.97 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 478 బేళ్లను తీసుకురాగా, 319 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.194.97 ధర పలికిందని వివరించారు.

ముగిసిన ఉచిత కంటి వైద్యశిబిరం

మర్రిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శంకర్ నేత్రాలయ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం గురువారంతో ముగిసింది. మర్రిపాడుకు చెందిన ఎన్ఆర్ఐ శ్రీలక్ష్మీ శివప్రియ దంపతుల ఆధ్వర్యంలో దాదాపు పది రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 1600 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించారు. 180 మందికి కంటి శస్త్రచికిత్సలు చేశారు. మరో 130 మందికి త్వరలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగవరపు శ్రీధర్‌నాయుడు, వెంకట్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్

కావలి (జలదంకి): ఇటీవల కావలిలో మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను గురువారం పట్టుకున్నట్లు కావలి ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలు..ఇటీవల కావలి రైల్వేస్టేషన్ వద్ద రెండు, యానాదిరెడ్డి వీధిలో ఒకటి చొప్పున మోటార్‌సైకిళ్లు చోరీకి గురయ్యాయి. బాధితులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. కావలిలోని గాయత్రినగర్‌కు చెందిన ఎస్‌కే సుబానీ, అరుంధతీయవాడకు చెందిన దావులూరి సుజన్ మోటార్‌సైకిళ్లను చోరీ చేసినట్లుగా విచారణలో గుర్తించారు. గురువారం కావలి జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో దొంగలు ఉండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణానికి సర్వే

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని పాత రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వేమిరెడ్డి బజారు వరకు అధ్వానంగా ఉన్న డ్రైనేజీ కాలువను అభివృద్ధి చేసేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి పంచాయతీ సిబ్బంది గురువారం సర్వే చేపట్టారు. సర్వే పూర్తయిన వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపడతామని పంచాయతీ ఈఓ రామారావు తెలిపారు.

వర్షం పడితే ఈదాల్సిందే!



మండల కేంద్రమైన అనంతసాగరంలోని బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు చినుకు పడితే వర్షపు నీరు నిల్వ చేరి వాగును తలపిస్తోంది. బీసీ కాలనీలో బ్యాంకు, రెండు పాఠశాలలు ఉన్నాయి. నిత్యం విద్యార్థులు, కాలనీవాసులు, బ్యాంకు ఖాతాదారుల రాకపోకలతో బీసీకాలనీ రోడ్డు రద్దీగా ఉంటుంది. బీసీ కాలనీలో డ్రైనేజీలు లేకపోవడంతో చినుకుపడితే వర్షపునీరు రోడ్డుపై నిల్వ చేరుతోంది.దీంతో కాలనీవాసులతో పాటు విద్యార్థులు, బ్యాంకు ఖాతాదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. –సోమశిల

ఆర్టీసీ స్థలాలను పరిరక్షించాలి



ఆత్మకూరురూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి ఉన్న అత్యంత విలువైన స్థలాలను పరిరక్షించాలని ఆత్మకూరు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేసే ప్రయత్నాలను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిపో గౌరవాధ్యక్షుడు మహమ్మద్‌ఆలీ, రీజనల్ బాధ్యుడు నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం విజయవాడలోని కోట్లాది రూపాయల విలువైన పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ అనే సంస్థకు షాపింగ్ మాల్ కట్టుకునేందుకు అప్పగించే ప్రతిపాదనలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సుందరయ్య, పెంచలయ్య, జాయింట్ సెక్రటరీ గిరీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లకు దాసోహం కావద్దు



ఆత్మకూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దాసోహం కాకుండా, చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని గాయత్రి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలోని విద్యార్థులకు క్రమశిక్షణ, సెల్‌ఫోన్లపై ఆకర్షణకు గురికావద్దన్న అంశాలపై సీఐ గంగాధర్‌తో కలిసి ఆయన గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థినులు సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థినులపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటే వెంటనే పాఠశాల యాజమాన్యం లేదా పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యంకికి నివాళి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని సోమవారం నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆటపాటలతో బోధన చేపట్టాలి



ఉదయగిరి రూరల్: విద్యార్థులకు పరిసరాలను పరిచయం చేస్తూ ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మాసాయిపేట హరిజనవాడ, మెయిన్, ఉర్దూ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్ఎం షేక్ అర్షియాబేగం ఉన్నారు.

కుట్టుమెషీన్ల పంపిణీ



కావలి (జలదంకి): కావలికి చెందిన అనిత, కవిత తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఐదుగురు నిరుపేద మహిళలకు కుట్టు మెషీన్లను గురువారం వితరణ చేశారు. పట్టణానికి చెందిన సాయి చారిటబుల్ ట్రస్టులో ఉచిత కుట్టు శిక్షణ పొందిన వారికి కుట్టు మెషీన్లను అందజేశారు. ట్రస్టు అధ్యక్షురాలు మాధవి, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు షేక్ బాషా, మున్సిపల్ మేనేజర్ ఫణికుమార్, ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పులి రజని, పులి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

సోమశిల జలాలు వృథా



ఏటీఎస్ చానల్ ఉప్పొంగి వృథాగా పోతున్న సోమశిల జలాలు

ఉత్తర కాలువ 50 నుంచి 52వ కిలోమీటర్ల మధ్యలో సోమశిల జలాలు వృథాగా పోతున్నాయి. ప్రస్తుతం రెండో పంటకు సోమశిల జలాలను ఉత్తర కాలువ ద్వారా 350 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఉత్తర కాలువ 50వ కిలోమీటరు నుంచి ఏటీఎస్ చానల్ ద్వారా ఆత్మకూరు చెరువు, అలాగే ఉత్తరకాలువ ఆయకట్టు రైతులకు మరో ఉపకాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నారు. అయితే కోనసముద్రం వద్ద ఏటీఎస్ కాలువ గట్టు పొంగి సాగునీరు వృథాగా పోతున్నాయి. ఉత్తర కాలువ 50వ కిలోమీటరు నుంచి అనుమసముద్రంపేట, రాళ్లపాడు రిజర్వాయర్లకు తాగు, సాగునీటి అవసరాలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేయడంతో జీవజలాలు వృథాగా పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే సమస్య నెలకొంటున్నా అధికారులు నిర్లక్ష్యంతో వృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. –ఆత్మకూరురూరల్